



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM


బంగారం ధర ₹62,950 10 GRMS 24 CARAT
వెండి ధర 1KG 77,200
సెన్సెక్స్ 71,686 ↑499
నిఫ్టీ 21,611 ↑149
చికెన్ ధర 1KG ₹230
గుడ్ల ధరలు డజన్ ₹68



## బాలయ్య ఇంటికి టైటాన్స్

ప్రొ కబడ్డీ సీజన్-10లో హైదరాబాద్ అంచెకు వేళైంది. శుక్రవారం నుంచి గచ్చిబౌలి స్టేడియంలో ఈ లీగ్ జరగనుంది. ఇప్పటికే అన్ని జట్లు నగరానికి చేరుకున్నాయి. స్థానిక జట్టు తెలుగు టైటాన్స్ గురువారం లీగ్ ప్రచారకర్త నందమూరి బాలకృష్ణ ఇంటికి వెళ్లింది. జెర్సీని బహూకరించింది. ఈ సందర్భంగా టైటాన్స్ లీగ్‌లో రాణించాలని బాలకృష్ణ ఆకాంక్షించారు. శుక్రవారం బెంగళూరు బుల్స్‌తో టైటాన్స్.. పట్నాతో యూపీ తలపడనున్నాయి.

### గర్భగుడికి చేరిన రామ్ లల్లా.. 22న అయోధ్య

# రామయ్య ప్రాణ ప్రతిష్ఠ



అయోధ్యలో ఈ నెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ క్రతువుల్లో భాగంగా గురువారం కీలక ఘట్టం చోటుచేసుకుంది. అయోధ్య రామాలయ గర్భగుడిలోకి రామ్ లల్లా విగ్రహాన్ని చేర్చారు. తెల్లవారుజామునే జై శ్రీరామ్ నినాదాలు, పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య క్రేన్ సహాయంతో విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకొచ్చారు. అనంతరం బాల రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో రామ్ లల్లాను ప్రతిష్ఠించేందుకు ముందు విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసే జలదివస్‌తో పాటు గణేశ పూజ, వరుణ పూజ నిర్వహించారు. కర్ణాటకకు చెందిన అరుణ్ యోగిరాజ్ అనే శిల్పి చేతుల మీదుగా రూపుదిద్దుకున్న 51 అంగుళాల ఈ విగ్రహం బుధవారం రాత్రి అయోధ్యకు చేరగా, క్రేన్ సహాయంతో దానికి ఆలయ ప్రాంగణానికి చేర్చారు. అక్కడి నుంచి గురువారం ఉదయం గర్భగుడిలోకి చేర్చారు. 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారమే ప్రారంభం కాగా, ఆ రోజు నదీ ఒడ్డున దీపోత్సవం, హారతి, బుధవారం కలశ పూజ వంటి క్రతువులు నిర్వహించారు.

**ఆన్‌లైన్‌లో అయోధ్య ప్రసాదం అమ్మకం లేదు**

ప్రస్తుతానికి అయోధ్య రాముని ప్రసాదం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచలేదని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ గురువారం స్పష్టం చేసింది. అయోధ్య ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నామని కొందరు సైబర్ మోసగాళ్లు ప్రకటించడంతో భక్తులు గందరగోళానికి గురవుతున్నారని, తాము ఆన్‌లైన్‌లో ప్రసాదాన్ని అమ్మడం లేదని, దీనికి సంబంధించి ఎలాంటి ఏజెన్సీ, వ్యాపార సంస్థలకు ఫ్రాంచైజీలు ఇవ్వలేదని ట్రస్ట్ క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా వివరించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అనేది లాభాపేక్ష లేని సంస్థ అని, అయోధ్య రాముని దర్శించుకునే వారికి యాలకుల ప్రసాదాన్ని ఉచితంగా పంచుతామని, దానిని చెక్‌పాయింట్లను దాటి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు.

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రదాని నరేంద్ర మోదీ గురువారం స్మారక తపాల బిళ్లను, ప్రపంచ వ్యాప్తంగా రాముడిపై విడుదల చేసిన స్టాంపుల పుస్తకాన్ని విడుదల చేశారు

**22న కేంద్ర ఉద్యోగులకు సగం రోజు సెలవు**

అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగే 22న దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సగం రోజు సెలవును మంజూరు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆ రోజు రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు, వివిధ ప్రాంతాలలో జరిగే ఉత్సవాలలో పాల్గొనడానికి వీలుగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు సెలవు ఇస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న డిమాండ్, వారి మనోభావాలను గౌరవించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

## అయోధ్య రామ మందిర ఆసక్తికర విషయాలు

అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠాపన తేదీ సమీపిస్తున్న కొద్దీ.. రామ జన్మభూమికి సంబంధించి విశేషాలు తెలుసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జనవరి 22న జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో సహా దేశ నలుమూలల నుంచి ప్రముఖులు, సామాన్యులు హాజరుకాబోతున్నారు. దేశంలోని అన్ని నగరాల్లో కార్యక్రమం లైవ్‌లో ప్రదర్శితం కానుంది. అయోధ్యకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను ఇప్పుడు చూద్దాం... హిందువుల ప్రసిద్ధ పుణ్య క్షేత్రాల్లో ఒకటిగా అయోధ్య నిలవనుంది. రాముడి జన్మస్థలంగా, పవిత్ర స్థలంగా అయోధ్యను పరిగణిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2020 ఆగస్టు 5న రామమందిరానికి శంకుస్థాపన చేశారు. ఆలయ వ్యవహారాలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఈ ట్రస్ట్ 2.7 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఆలయాన్ని పర్యవేక్షిస్తోంది. రామాలయాన్ని సంప్రదాయ నాగర్ శైలిలో నిర్మించారు. పొడవు 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు. మూడంతుస్థుల్లో నిర్మాణం జరుగుతోంది. ఒక్కో అంతస్తు 20 అడుగుల ఎత్తు ఉంటుంది. దీనికి 392 స్తంభాలు, 44 తలుపులు, 5 మండపాలున్నాయి. అవి నృత్య, రంగ, సభా, ప్రార్థనా, కీర్తన మండపాలు. భక్తులు సింగ్ ద్వార్ నుంచి 32 మెట్లు ఎక్కి ఆలయంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది.



# దేశంలో గోధుమలకు కొరత..



దేశంలో గోధుమల నిల్వలు భారీగా పడిపోయాయి. జనవరి 1 నాటికి దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వ గోదాముల్లో గోధుమల స్టాక్ 163.53 లక్షల టన్నులుగా ఉన్నట్టు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), స్టేట్ ఫుడ్ ఏజెన్సీల గణాంకాలను బట్టి తెలుస్తున్నది. 2017 తర్వాత ఈ స్థాయిలో నిల్వలు పడిపోవడం ఇదే తొలిసారి. గోధుమ నిల్వల కనీస బఫర్ స్థాయిని 138 లక్షల టన్నులుగా నిర్ణయించారు. ప్రస్తుతం బఫర్ స్థాయి కంటే గోధుమల నిల్వలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్, ఇరాన్-పాక్ దేశాల మధ్య కొనసాగుతున్న సంక్షోభ పరిస్థితులు పలు దేశాల ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతోపాటు ద్రవ్యోల్బణ భయాలు ఉండనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో దేశంలో గోధుమలకు కొరత ఏర్పడితే, అది ఆహార సంక్షోభానికి దారితీయొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వెంటనే గోధుమల నిల్వలను పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### కోహ్లీకి అలాంటి పదం

# ఇష్టం ఉండదు

### ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ




అఫ్గానిస్థాన్‌తో మూడో టీ20లో (IND vs AFG) ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు చేరాడు. కానీ, మెరుపు ఫీల్డింగ్‌తో అలరించాడు. మరోవైపు సంజూ శాంసన్ కూడా సున్నాకే ఔట్ కావడం గమనార్హం. వీరిద్దరిపై ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శతకం చేసిన సంగతి తెలిసిందే. మ్యాచ్‌లో విజేతగా తేలడానికి రెండు సూపర్ ఓవర్లు పట్టాయి. చివరికి టీమ్‌ఇండియా విజయం సాధించింది. "ఇప్పటి వరకు మేం ఆడిన అన్ని సిరీసుల్లోనూ బాధ్యతలను స్పష్టంగా పంచుకొన్నాం. మా ఆటగాళ్లకు వారి పాత్రపై స్పష్టత ఇచ్చాం. జట్టుకు తమ అవసరం ఎక్కడ ఉందో యువకులకూ తెలుసు. చివరి మ్యాచ్‌లో విరాట్ గోల్డెన్ డక్‌గా పెవిలియన్‌కు చేరాడు. పరుగులు చేయాలనే కసితోనే బరిలోకి దిగాడు. అతడికి డక్ అనే పదం అస్సలు ఇష్టం ఉండదు. అలా ఔటైనప్పటికీ అతడి ఆలోచన మాత్రం సరైన దిశలోనే ఉంది. వికెట్ కీపర్ సంజూ శాంసన్ కూడా ఇలానే వికెట్ కోల్పోయాడు. దూకుడుగా ఆడాలనే ఉద్దేశం అతడిలోనూ ఉంది" అని పేర్కొన్నాడు.

**వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమిపై..**

"ఇప్పుడు దాని గురించి ఆలోచించడం సరైంది కాదు. నా వరకైతే 50 ఓవర్ల ప్రపంచ కప్ గెలవడం ఎప్పటికీ ప్రత్యేకమే. అలాగని టీ20 ప్రపంచ కప్, టెస్టు ఛాంపియన్‌షిప్ కీలకమైన ఈవెంట్లు కాదని చెప్పడంలేదు. వన్డే ప్రపంచ కప్‌ను చూస్తూ పెరిగా. భారత్‌లో ఆ టోర్నీ జరగడం అభిమానుల్లో ఉత్సాహాన్ని పతాకస్థాయికి చేర్చింది. అత్యుత్తమ ఆటతీరుతో ఫైనల్‌కు చేరుకున్నాం. అక్కడా తీవ్రంగా శ్రమించాం. కానీ, ఫలితం దక్కలేదు. జట్టుగా మేమంతా నిరుత్సాహానికి గురయ్యాం. మా మీద అప్పుడు అభిమానులూ ఆగ్రహంతో ఉన్నారు. దానిని నేను అర్థం చేసుకోగలను. ప్రస్తుతం మన ముందు టీ20 ప్రపంచ కప్‌ను గెలిచే అవకాశం ఉంది. తప్పకుండా విజయం సాధిస్తామనే నమ్మకంతో బరిలోకి దిగుతాం" అని భారత కెప్టెన్ వ్యాఖ్యానించాడు.



### త్వరలో ఎమ్మెల్సీలతో


# కేసీఆర్ భేటీ

పార్టీ అధినేత కేసీఆర్ త్వరలో ఎమ్మెల్సీలతో సమావేశమవుతారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆ సమావేశంలోనే శాసనమండలిలో పార్టీ నా యకుడి ఎంపిక ఉంటుందని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీల భాగస్వామ్యం, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీలు పార్టీకి కండ్లు, చెవుల మాదిరి పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభలో పార్టీ తరపున ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఖాయమని, అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలే ఎక్కువగా ఉంటాయని వివరించారు. అన్ని స్థాయిల్లో పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపైకి తేవటంలో ఎమ్మెల్సీలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పార్టీని గ్రామస్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు పునర్వ్యవస్థీకరించాలనేది పార్టీ అధినేత కేసీఆర్ ఆలోచనా విధానమని, అందుకు అనుగుణమైన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని చెప్పారు. జిల్లా పార్టీ కార్యాలయాల కేంద్రంగా కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. పార్లమెం ట్ నుంచి పంచాయతీ వరకు అభ్యర్థుల విజయానికి అన్ని రకాల వ్యూహాలు, ఎత్తుగడలను అనుసరించాలని సూచించారు.

# టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా ఐపీఎస్?

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్‌గా పోలీసు ఉన్నతాధికారిని నియమించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వారిలో ప్రస్తుతం సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్న ఒక ఐపీఎస్ అధికారితోపాటు రాష్ట్రానికి విశేష సేవలందించిన రిటైర్డ్ ఐపీఎస్ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఆ అధికారి చైర్మన్ పదవికి సుముఖంగా లేరని తెలిసింది. చైర్మన్ పోస్టుకు మాజీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు సుముఖంగానే ఉన్నప్పటికీ, ప్రభు త్వం నిర్ణయించిన వయోపరిమితి ప్రకా రం ఆయన ఒక ఏడాది మాత్రమే ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉంటుంది. దీంతో ప్రభుత్వ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ సభ్యుల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 18 వరకు దరఖాస్తులను స్వీకరించగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్టు తెలిసింది. దరఖాస్తులను స్క్రూటినీ చేసేందుకు కమిటీని నియమించి, సభ్యుల అర్హతలను తేల్చనున్నట్టు సమాచారం. వడపోత ప్రక్రియ ముగిసిన అనంతరం సభ్యులను, చైర్మన్‌ను ప్రభుత్వం నిర్ణయించనున్నది.

## రేపు నవోదయ ప్రవేశ పరీక్ష



నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు రేపు (శనివారం) పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉదయం 11.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. ఏపీలో 91,041 మంది, తెలంగాణ నుంచి 50,332 మంది పరీక్ష రాయనున్నారు. ఏపీలో 416, తెలంగాణలో 244 సెంటర్లు ఏర్పాటు చేశారు.


## ఎస్సీ వర్గీకరణపై కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం!

ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీనిలో సభ్యులుగా కేంద్ర హోంశాఖ, న్యాయశాఖ, గిరిజన, సామాజిక న్యాయశాఖల కార్యదర్శులు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ వర్గీకరణకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. దీనిపై ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకు గతంలో సుప్రీంకోర్టు అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 22న కమిటీ తొలిసారి భేటీ కానున్నట్లు సమాచారం.



### రేపే సలార్

# ఓటీటీ రిలీజ్




హీరోయిన్ గా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన వైలెంట్ యాక్షన్ డ్రామా "సలార్". మరి ఎన్నో అంచనాలు నడుమ వచ్చిన వచ్చిన ఈ చిత్రం ప్రభాస్ కెరీర్ లోనే రెండో అతిపెద్ద హిట్ గా అయితే నిలిచింది. మరి సర్ప్రైజింగ్ గా ఈ సినిమాడే ని నెట్ ఫ్లిక్స్ వారు యాప్ లో ఇచ్చేసారు. దీనితో ఈ సినిమా అంటే రేపే జనవరి 20 నుంచే వస్తున్నట్టుగా ఫిక్స్ అయ్యిపోయింది. మరి ఈ భారీ ఎంటర్టైనర్ ని అయితే రేపటి నుంచి విట్నెస్ చెయ్యవచ్చు. ఇక ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతం అందించగా హోంబాళే ఫిల్మ్స్ వారు నిర్మాణం వహించారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## ఓటీటీలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన ఎక్స్ట్రార్డినరీ మ్యాన్

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు వక్కంతం వంశీ తెరకెక్కించిన లీసెంట్ చిత్రం "ఎక్స్ట్రార్డినరీ మ్యాన్" కోసం తెలిసిందే. డీసెంట్ బజ్ ని సెట్ చేసుకున్న ఈ చిత్రం అనుకున్న రేంజ్ అంచనాలు అందుకోలేక ఫ్లాప్ గానే నిలిచింది. దీనితో నెక్స్ట్ ఓటిటి రిలీజ్ త్వరలోనే వస్తుంది అని ముందే ఫిక్స్ కాగా కొన్ని రోజులు కోటమే డేట్ కూడా వచ్చేసింది. ఈ జనవరి 19 నుంచి తమ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ డిస్నీ+ హాట్ స్టార్ వారు కన్ఫర్మ్ చేసారు. ఇక అన్నట్టే ఈ చిత్రం ఈరోజు నుంచి ఇందులో స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి అప్పుడు మిస్ అయ్యి ఓటిటి వచ్చాక చూద్దాం అనుకునేవారు ఇప్పుడు ట్రై చేయవచ్చు. ఇక ఈ చిత్రానికి హారీష్ జై రాజ్ సంగీతం అందించగా శ్రేష్ట్ మూవీస్ మరియు ఆదిత్య ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహించారు.



## రాముడి కోసం.. నిద్రాహారాలలో కఠిన నియమాలు పాటిస్తున్న మోదీ



అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని కేంద్రం చాలా ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. మందిర నిర్మాణం నుంచి ప్రతి విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. బీజేపీ పెద్దల ఆశయాల్లో ఒకటిగా ఉన్న రామమందిరం నిర్మాణం తన చేతులమీదుగా జరగడం అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అప్పటికే పలుమార్లు చెప్పారు. అయోధ్య ఆలయ గర్భగుడిలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముందే జనవరి 12 అనుష్టాన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. నాటి నుంచి మోదీ కఠిన నియమాలు పాటిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ నిత్యం కేవలం నేలపైనే నిద్రిస్తుస్తున్నారు. కేవలం కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతున్నారు. 11 రోజుల ప్రత్యేక అనుష్టానంలో భాగంగా ఆయన కఠిన నియమాలు పాటిస్తున్నారు. సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. సమయం చిక్కినప్పుడల్లా రామనామం జపిస్తున్నారు. తన నివాసంలో రాముడికి పూజలు చేస్తున్నారు. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి ప్రధాన యజమానిగా మోదీ వ్యవహరించనున్నారు. జనవరి 22న రామ్‌లల్లా ప్రాణప్రతిష్టతో మోదీ అనుష్టానం ముగుస్తుంది. జనవరి 22న జరగనున్న అయోధ్య రాముని ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగనుంది. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా ఈ వేడుకకు హాజరుకానున్నారు. దేశ వ్యాప్తంగా ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మొత్తంగా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి 7,000 మంది హాజరుకానున్నారు. 100 మంది విదేశీ ప్రముఖులు కూడా ఈ వేడుకకు రానున్నారు.



## హసరంగ మ్యాజిక్.. చిత్తుగా ఓడిన జింబాబ్వే

జింబాబ్వేతో జరిగిన నిర్ణయాత్మక మూడో టీ20 శ్రీలంక స్పిన్ సెన్సేషన్, ఆ జట్టు కెప్టెన్ వనిందు హసరంగ (4-0-15-4) మ్యాజిక్ చేశాడు. ఫలితంగా శ్రీలంక 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. హసరంగ, తీక్షణ (3.1-0-14-2), ఏంజెలో మాథ్యూస్ (2-0-15-2), ధనంజయ డిసిల్వ (1-0-1-1), మధుషంక (2-0-22-1) ధాటికి 14.1 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే ఇన్నింగ్స్‌లో కమున్‌హుకామ్వే (12), బ్రియన్ బెన్నెట్ (29), సీన్ విలియమ్స్ (15), కెప్టెన్ సికందర్ రజా (10) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక.. 10.5 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఆడుతూపాడుతూ విజయతీరాలకు చేరింది. పథుమ్ నిస్సంక (39 నాటౌట్), కుశాల్ మెండిస్ (33) రాణించగా.. ధనంజయ డిసిల్వ 15 పరుగులతో అజేయంగా నిలిచాడు. కుశాల్ మెండిస్ వికెట్ సీన్ విలియమ్స్‌కు దక్కింది. ఈ సిరీస్‌లో తొలి టీ20లో శ్రీలంక గెలువగా.. రెండో మ్యాచ్ జింబాబ్వే, ఇప్పుడు మూడో మ్యాచ్ మళ్లీ శ్రీలంకనే గెలిచి సిరీస్ కైవసం చేసుకుంది.

# రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రపై కేసు నమోదు



రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ఆదివారం మణిపుర్ నుంచి ప్రారంభమైంది. ప్రారంభమైన అయిదు రోజులకే కేసు నమోదైంది. గురువారం అస్సాంలోని జోర్హాట్ పట్టణంలో అనుమతి లేని ప్రదేశం మీదుగా యాత్ర చేశారంటూ యాత్ర నిర్వాహకులు కేబి బైజుపై కేసు నమోదు చేశారు పోలీసులు. గతంలో యాత్రకు అనుమతి ఇచ్చిన కేబీ రోడ్ వైపు వెళ్లకుండా పట్టణంలోని మరో మార్గం గుండా యాత్ర సాగినందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు పోలీసులు. దీంతో ఆ ప్రాంతమంతా అస్తవ్యస్తమైనట్లు చెప్పారు. రాహుల్ అటువైపుగా పాదయాత్ర చేయడంతో ఒక్కసారిగా ప్రజలు యాత్రలో పాల్గొన్నారు. రాహుల్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. తీవ్ర తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన కారణంగానే యాత్రపై, దాని నిర్వాహకులపై సుమోటోగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కేబీ బైజు తెలిపారు. యాత్ర నిర్వహించే జిల్లా యాంత్రాంగం నిబంధనలను పాటించలేదని, రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘించారని ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు పోలీసులు. ఈ చర్యలపై కాంగ్రెస్ నేత దేబబ్రత సైకియా స్పందించారు. యాత్రకు ముందుకు సాగనివ్వకుండా అవసరమైన చర్యలు, అడ్డంకులు సృష్టిస్తున్నట్లు తెలిపారు. ఇది పాలకులు వేసిన ఎత్తుగడగా అభివర్ణించారు. పీడబ్ల్యూడీ పాయింట్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఎవరూ లేరని, గతంలో నిర్ణయించిన మార్గం చాలా చిన్నది కారణంతో వేరే మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు కాంగ్రెస్ నేతలు. పైగా తమ ర్యాలీలో భారీగా ప్రజలు పాల్గొన్నారని చెప్పారు. దీంతో తాము కేవలం కొన్ని మీటర్ల పరిధి వరకు మాత్రమే పక్క మార్గంలో యాత్ర చేపట్టామని వివరించారు. అస్సాంలో తొలిరోజు యాత్ర విజయవంతమవుతుందన్న భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దేబబ్రత తెలిపారు. ఎన్ని ఇబ్బందులు కలిగించినప్పటికీ అస్సోంలో జనవరి 25 వరకూ 17 జిల్లాల గుండా 833 కిలో మీటర్ల మేర యాత్ర కొనసాగుతుందని తెలిపారు. అలాగే మొత్తం భారత్ జోడో న్యాయ్ యాత్ర దేశంలోని 15 రాష్ట్రాల్లో 110 జిల్లాల మీదుగా 67 రోజుల పాటు 6713 కిలోమీటర్లు ప్రయాణించేలా ప్రణాళికలు రచించారు.



## గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా 1,500 మంది రైతు దంపతులు


దేశ రాజధాని నగరంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక అతిథులుగా 1,500 మంది రైతు దంపతులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవాలకు రైతు దంపతులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించడం ఇదే తొలిసారి అని చెప్పారు.దేశంలోని అన్ని ప్రాంతాల వారిని ఎంపిక చేసి ఆహ్వానించామన్నారు. వ్యవసాయోత్పత్తుల సంఘాల ప్రతినిధులు, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, చిన్న తరహా నీటిపారుదల పథకాల లబ్ధిదారులు వీరిలో ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా వీరికి విందు ఇస్తారని చెప్పారు. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాలకు దాదాపు 500 మంది రైతులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు.

## మినీ డ్రెస్‌లో అనన్య పాండే



శైలి కారణంగా ప్రతిరోజూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తుంది. అటువంటి పరిస్థితిలో, అనన్య అభిమానుల జాబితా నిరంతరం పొడవుగా ఉంది. ఆయనను చూసేందుకు అభిమానులు తహతహలాడుతున్నారు. ఈసారి మళ్లీ అనన్య తన కొత్త లుక్ కారణంగా చర్చలోకి వచ్చింది.కొంతకాలం క్రితం, అనన్య పాండే తన గ్లామరస్ లుక్‌ను ప్రదర్శించి కెమెరా ముందు కిల్లర్ పోజులు ఇచ్చింది. ఈ ఫోటోషూట్‌లో ఆమె బ్లాక్ ఆఫ్ షోల్డర్ మినీ డ్రెస్ వేసుకుంది.అనన్య సూక్ష్మమైన బేస్, న్యూడ్ నిగనిగలాడే పెదవులు మరియు మెరిసే స్మోకీ ఐ మేకప్‌తో తన రూపాన్ని పూర్తి చేసింది. ఈ లుక్‌తో, ఆమె తన హెయిర్‌స్టైల్‌కు ఉంగరాల టచ్ ఇచ్చి తన జుట్టును తెరిచి ఉంచింది.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగో జాబితా



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగో జాబితాలో అత్యధికంగా ఎస్సీ రిజర్వుడు స్థానాలకు ఇన్ చార్జీలను మార్చింది. నాలుగో జాబితాలో ఎస్సీ రిజర్వుడులో 1 ఎంపీ 7 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చింది. తాజాగా ఐదుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో సీట్లు ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. సీట్లు కోల్పోయిన వారిలో నలుగురు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. శింగనమల, నందికొట్కూరు, తిరువూరు, మడకసిర, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి మొండిచేయి చూపించింది. శింగనమల (ఎస్సీ రిజర్వడ్) సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి వచ్చే ఎన్నికల్లో సీటు ఇచ్చేందుకు అధిష్ఠానం నిరాకరించింది. శింగనమల అసెంబ్లీ సమన్వయకర్తగా ఎం.వీరాంజనేయులను నిమామించింది. నందికొట్కూరు (ఎస్సీ రిజర్వడ్) సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ పోలీస్ ఉన్నతాధికారి తోగురు అర్థర్‌కు వచ్చే ఎన్నికల్లో సీటు నిరాకరించిన జగన్.. నందికొట్కూరు అసెంబ్లీ సమన్వయకర్తగా డాక్టర్ దారా.సుధీర్‌ను ప్రకటించారు. తిరువూరు (ఎస్సీ రిజర్వడ్) సిట్టింగ్ ఎమ్మెల్యే రక్షణ నిధికి వచ్చే ఎన్నికల్లో సీటు నిరాకరిస్తూ.. ఆ నియోజకవర్గం అసెంబ్లీ సమన్వయకర్తగా నల్లగట్ల స్వామిదాస్‌ను నియమించారు. మడకసిర (ఎస్సీ రిజర్వడ్) సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పే స్వామికి ఈ సారి సీటు ఇవ్వలేదు. ఆ నియోజకవర్గం ఇంచార్జిగా ఈర లక్కప్పను నియమించారు. కనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రా మధుసూధన యాదవ్‌కు ఈసారి సీటు ఇవ్వలేదు. కనిగిరి అసెంబ్లీ ఇంచార్జిగా దద్దాల నారాయణ యాదవ్‌ను నియమించారు.



## ఢిల్లీలో అగ్ని ప్రమాదం.. ఆరుగురు సజీవదహనం

ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బిల్డింగ్‌లో చెలరేగిన మంటల్లో రెండు కుటుంబాలు చిక్కుకున్నాయి. ఆరుగురు సజీవ దహనం అయ్యారు. మృతుల్లో నలుగులు మహిళలు ఉన్నారు. ఢిల్లీలోని పితంపురా ప్రాంతంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి అనుకోకుండా భవనంలో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. రెండు కుటుంబాల సభ్యులు మంటల్లో చిక్కుకున్నారు. పొగలకు తోడు అగ్ని కీలలు చుట్టుముట్టడంతో ఆరుగురు సజీవ దహనం అయ్యారని పోలీసులు తెలిపారు. ఇందులో నలుగురు మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది.. మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. భవనంలోకి ప్రవేశించి మృతదేహాలను బయటకు తీశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యోగులకు మరో షాకిచ్చిన గూగుల్..

టెక్ దిగ్గజం గూగుల్ ఉద్యోగులకు మరో షాకిచ్చింది. గత కొన్ని నెలలుగా వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తూ వస్తున్న ఈ సంస్థ 2024లో సైతం ఈ తొలగింపులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రకటనలు, అమ్మకాల విభాగం నుంచి వెయ్యి మందిని తొలగిస్తున్నట్టు గూగుల్ ఈ వారమే ప్రకటించింది. అయితే ఈ తొలగింపులు ఇంకా ఆగిపోలేదని, ఈ ఏడాది మరింత అధికంగా ఉంటాయని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ నిర్ధారించారు. ఈ సందర్భంగా 'లేఆఫ్' అన్న పదాన్ని వాడటాన్ని ఆయన వ్యతిరేకించారు. ఈ ఏడాది సంస్థలో చేపట్టే భారీ మార్పుల గురించి ఇంటర్నెట్‌లో లీకైన ఆయన అంతర్గత మెమోలో వివరించారు. వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బందిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం గురించి ఆయన మాట్లాడారు. అయితే లేఆఫ్ అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. దానికి బదులుగా సంస్థకు మీరు అవసరం లేదని చెప్పడం ఒక ఫ్యాన్సీ మార్గమని ఆయన పేర్కొన్నారు. కాగా, యూట్యూబ్‌లో సుమారు 100 మంది ఉద్యోగులపై గూగుల్ తాజాగా వేటు వేసింది.

